## క్లుప్తంగా

### విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

గరుగుబిల్లి: మండలంలోని పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఆ శాఖ ఏఈ బి.శ్రీనివాసనాయుడు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. మండల కేంద్రం నుంచి సీతానగరం మండలంలోని బూర్జ వరకు విద్యుత్ లైన్‌ల ఏర్పాటు నేపథ్యంలో గరుగుబిల్లి మండల కేంద్రం సహా పెద్దూరు, బీవీపురం, చినగుడబ, ఉద్దవోలు, పెదగుడబ, వల్లరగుడబ తదితర గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

### వచ్చే నెల 7న మాదిగ మహామేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్, మాదిగ నాయకులు

బలిజిపేట: వచ్చే నెల(జూలై) 7వ తేదీన ఒంగోలు మున్సిపల్ ఆడిటోరియంలో నిర్వహించనున్న మాదిగ మహామేళాను విజయవంతం చేయాలని మాదిగ మహామేళా రాష్ట్ర కో కన్వీనర్ ఎస్.లక్ష్మణరావు మాదిగ కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో మహామేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఎంఆర్‌పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహామేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో బి.రామారావు మాదిగ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కొప్పల వెలమల అభివృద్ధికి కృషి చేయాలి

పార్వతీపురం: కొప్పల వెలమ సంఘ అభివృద్ధికి ప్రతిఒక్కరూ అంకితభావంతో కృషి చేయాలని ఆ సంఘ గౌరవాధ్యక్షుడు చుక్క భాస్కరరావు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక సీఎస్ఎన్ వేదికలో జిల్లా అధ్యక్షుడు చల్లారపు రమేష్‌నాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో కొప్పల వెలమ సంఘ భవనాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 35 శాతానికి పైగా ఉన్న కొప్పల వెలమలకు రాజకీయ ప్రాధాన్యం పూర్తిగా కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా పనిచేసి సంఘ అభివృద్ధికి కృషి చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కొప్పల వెలమలను ఒక్కతాటిపైకి తెచ్చేందుకు నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, కొప్పల వెలమ సంఘ రాష్ట్ర డైరెక్టర్లు గొట్టాపు వెంకటనాయుడు, అక్కేన మధుసూదనరావు, కొల్లి అప్పలనాయుడుతో పాటు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, చుక్క జయప్రకాష్, చొక్కాపు వెంకటరమణ, పి.వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నాగుపాము హల్‌చల్..



కోడిగుడ్లు మింగిన నాగుపాము, పక్కనే మృతి చెందిన కోడి

పార్వతీపురం రూరల్: మండల పరిధి పెదబొండపల్లిలోని ఓ ఇంటిలో నాగుపాము హల్‌చల్ చేసింది. గ్రామానికి చెందిన ఎం. పార్వతి ఇంటిలో ఉన్న కోళ్ల గూడులోకి నాగుపాము దూరి కోడిగుడ్లను మింగేయడంతో పాటు తల్లికోడిని కాటేసింది. ఆదివారం వేకువజామున కోడిని వదిలేందుకు పార్వతి గంప ఎత్తగా పాము బుసలు కొడుతూ మీదకు వచ్చింది. వెంటనే అప్రమత్తమైన పార్వతి పక్కకు జరిగి స్థానికులకు విషయం తెలియజేయగా.. వారు వచ్చి పామును బయటకు తీశారు.

### స్మార్ట్‌మీటర్లపై ఆందోళన

పార్వతీపురం రూరల్: ఇటీవల విద్యుత్‌శాఖాధికారులు ఇళ్లకు, వ్యాపార సముదాయాలకు ఏర్పాటు చేస్తున్న స్మార్ట్‌మీటర్లు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. గతంలో కంటే ఈ మీటర్లు అమర్చిన అనంతరం ఎక్కువ మొత్తంలో బిల్లులు రావడంతో ఆందోళన చెందుతున్నారు. అలాగే పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఇటీవల మూడు రోజుల వ్యవధిలో రెండుచోట్ల మీటర్లు దగ్ధమవడంతో వినియోగదారులు మరింత ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి సంఘటనలు జరిగితే ప్రాణ నష్టంతో పాటు ఆస్తి నష్టం జరిగే అవకాశం ఉంది. ప్రజలపై ప్రయోగాలు చేయకుండా సరైన అధ్యయనం చేసిన అనంతరమే అమర్చాలని వినియోగదారులు కోరుతున్నారు.

● వరి సాగు..

# యాజమాన్య పద్ధతులే మేలు!



రైతులు సిద్ధం చేసిన నారుమడులు

- పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- సమయం, పెట్టుబడులు ఆదా
- నాణ్యమైన పంట దిగుబడి, భూసారానికి ఆస్కారం
- ఖరీఫ్ సీజన్ వేళ వ్యవసాయ నిపుణుల సూచన

పాలకొండ రూరల్: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఎరువులు, పురుగుమందుల వాడకంతో పాటు నీటి యాజమాన్యంలో మెలకువలు పాటిస్తే ఆరోగ్యవంతమైన, నాణ్యమైన పంట వస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ఆరంభం కావడంతో రైతులంతా పొలం పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సాగు తొలినాళ్ల నుంచి జాగ్రత్త వహిస్తూ పంటలు పండించుకుంటే వ్యవసాయాన్ని లాభదాయకం చేసుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు. వరి పంట పండించేందుకు ఆమ్ల, క్షార, చౌడు నేలలు మినహా మిగతా అన్ని నేలలూ సేద్యానికి అనుకూలమే. దుబ్బ, కారు, చౌడు నేలలో పంటకు నీరు అధికంగా కావాల్సి ఉంటుంది. అలాంటి నేలల్లో వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవడం మంచిదని అధికారులు చెబుతున్నారు.

**విత్తనాలు తడిపి ఆరబెట్టుకోవాలి..**

నియోజకవర్గంలోని రైతులంతా 1064, ఆర్‌జీఎల్ 2537, ఎంటీయూ 1121(శ్రీధృతి), ఎంటీయూ 7029(స్వర్ణ), బీపీటీ 5204(సాంబమసూరి) రకాల విత్తనాలను సాగుకు తీసుకువెళ్లారు. ఎకరానికి సరాసరిన 20 నుంచి 25 కిలోల విత్తనాలు.. నారు వేసేందుకు సరిపోతుంది. అయితే వాటిని విత్తుకునే ముందు కిలో విత్తనాలకు మూడు గ్రాముల కార్బండిజం కలిపి తడిపి ఆరబెట్టుకోవాలి. ఆ తర్వాత సిద్ధం చేసిన నారుమడిలో వేసుకోవాలి. జూలై 15వ తేదీ వరకు నారు పోసుకోవచ్చు. ఆగస్టు చివరి వరకు పొలంలో నాట్లు వేసుకోవచ్చు. పాలకొండ నియోజకవర్గంలోని వీరఘట్టం, సీతంపేట, భామిని, పాలకొండ మండలాల పరిధిలో 20,314 హెక్టార్లలో ఈ ఏడాది వరి సేద్యం చేయనున్నారు. ఈ మేరకు రైతులకు 25 వేల క్వింటాళ్ల మేర విత్తనాలు అందివ్వాల్సి ఉంటుంది.

**నారుమడి ఇలా ఉండాలి..**

- నారుమడిలో రెండు క్వింటాళ్ల పశువుల ఎరువు లేదా వర్మీకంపోస్ట్ వేసి రెండు, మూడు సార్లు బాగా దమ్ము చేసి చదును చేయాలి. సాధారణ పంట భూమి కన్నా నారుమడులను కొంచెం ఎత్తులో తయారు చేసుకోవాలి.
- ఐదు సెంట్ల నారుమడిలో 1 కిలో నత్రజని, రెండు కిలోల భాస్వరం, కిలో పొటాష్ గల ఎరువును దుక్కిలో వేసుకోవాలి. విత్తనాలు విత్తిన 15 రోజుల తర్వాత మళ్లీ కిలో నత్రజని వేసుకోవాలి. నాట్లు ఆలస్యమయ్యే ప్రదేశాల్లో నారు ముదురుపోకుండా చూసుకోవాలి.
- విత్తనం చల్లిన తర్వాత మొక్క దశలో పలచగా నీరు ఉండాలి.
- మెట్ట నారుమడుల్లో ఇనుము ధాతువు లోపం అత్యధికంగా కనిపిస్తుంది. దీని నివారణకు మొక్క ఎదుగుదలను అనుసరించి రెండు నుంచి ఐదు గ్రాముల అన్నభేది, గ్రాము ఉప్పును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- జింక్ ధాతువు లోపం నివారణకు జింక్ సల్ఫేట్ 2 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- నాట్లు వేయడానికి ముందు నారు కొనలు తుంచి వేసుకుంటే కాండం తొలిచే పురుగును నివారించుకోవచ్చు.

**నియోజకవర్గంలో సాగు వివరాలు..**

| మండలం | సాగు విస్తీర్ణం (హెక్టార్లలో) | రైతులు |
|---|---|---|
| పాలకొండ | 6,345 | 12,901 |
| వీరఘట్టం | 7,112 | 14,201 |
| సీతంపేట | 3,079 | 9,173 |
| భామిని | 3,778 | 7,549 |

- నారును 0.02 శాతం క్లోరోపైరిపాస్ ద్రావణంలో నాలుగు గంటలు ముంచి వేసుకుంటే కాండం తొలిచే పురుగు, ఆకుమడత దోమను నివారించవచ్చు.
- మధ్యకాలిక రకాలను చదరపు మీటరుకు 44 కుదుళ్లు, స్వల్పకాలిక రకాలైతే 66 కుదుళ్లు ఉండేలా చూడాలి. నారు బాగా ముదిరి ఆలస్యంగా నాటుకునేటప్పుడు కుదుళ్ల సంఖ్యను పెంచి కుదురుకు ఆరు నుంచి 8 మొక్కల చొప్పున నాటు వేయాలి.
- సమగ్ర పోషక యాజమాన్యం, సస్యరక్షణ చర్యల ద్వారా నారు పెంచుకుంటే ప్రధాన పంట పొలంలో వచ్చే సమస్యలు అధిగమించవచ్చు.

**రైతులు అవగాహన పెంచుకోవాలి..**



మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాగు పట్ల రైతులు అవగాహన పెంచుకోవాలి. విత్తనాల ఎంపిక దగ్గర నుంచి నారుమడి తయారీ, నాట్లు వేసుకోవడం, పంట సంరక్షణ పద్ధతులు ఇలా అన్నింట్లోనూ చైతన్యం పొందాలి. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది సూచిస్తున్న సూచనలు పాటించాలి. వరి సాగుకు సంబంధించి, కొంతమంది వెద జల్లగా, మరికొంతమంది నారుమడులు సిద్ధం చేసుకోవాలి.

–ఎస్ఎస్ఆర్‌వీ ప్రసాదరావు, మండల వ్యవసాయాధికారి, పాలకొండ

# 'యువత పోరు'కు తరలిరండి



భామిని నుంచి పిలుపునిస్తున్న వైఎస్సార్ సీపీ యువజన నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు నంగిరెడ్డి శరత్‌బాబు

కొమరాడ: నిరుద్యోగ యువతను కూటమి ప్రభుత్వం మోసం చేస్తున్న తీరును నిరసిస్తూ పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో సోమవారం చేపట్టే యువత పోరు కార్యక్రమానికి తరలిరావాలని వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షుడు నంగిరెడ్డి శరత్‌బాబు పిలుపునిచ్చారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా నిరుద్యోగ యువతకు ఇచ్చిన ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. నిరుద్యోగ యువత వారి మాయమాటలు నమ్మి మోసపోయారన్నారు. తాము అధికారంలోకి వస్తే ఉద్యోగాలు ఇస్తామని, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, నిరుద్యోగ భృతి కూడా ఇస్తామని చెప్పారని, అయినా వారు ఏ హామీ ఇంతవరకు అమలు చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై నిరుద్యోగుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. నిరుద్యోగ యువతకు అండగా నిలవాలన్న సదుద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ విద్యార్థి, యువజన విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం ఉంటుందని, ఆ సమయానికి పార్టీ శ్రేణులు, నిరుద్యోగులంతా రావాలని కోరారు.

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో జరిగే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యూత్ వింగ్ సెక్రటరీ నిమ్మక గోపాల్ కోరారు. ఇదే విషయమై ఆయన స్థానిక విలేకరులతో ఆదివారం మాట్లాడారు. నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు చొప్పున అందిస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. వారు అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా యువతకు ఇచ్చిన హామీల అమలును మరిచారని విమర్శించారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ వైఎస్సార్ సీపీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి అంతా తరలిరావాలన్నారు.

భామిని: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో సోమవారం జరిగే యువత పోరు కార్యక్రమానికి అందరూ తరలిరావాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బోదెపు శ్రీనివాసరావు, యువజన నాయకులు గెల్లంకి రమేష్ తదితరులు కోరారు.

### ఘనంగా మాజీ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి జన్మదిన వేడుకలు



జియ్యమ్మవలస రూరల్: పుష్పశ్రీవాణి పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

కొమరాడ/గుమ్మలక్ష్మీపురం/జియ్యమ్మవలస రూరల్: మండలాల్లో మాజీ డిప్యూటీ సీఎం, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకురాలు పాముల పుష్పశ్రీవాణి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలంతా కేక్ కట్ చేసి, పుష్పశ్రీవాణికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అందరికీ కేకులు పంచిపెట్టి, ఆమె తన రాజకీయ ప్రయాణంలో ఎదుర్కొన్న ఒడిదుడుకులు, విజయాలు, సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. మరికొన్నిచోట్ల ఆమె పేరిట రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ వంటి పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. కొమరాడలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, మరడాన సూరపునాయుడు, ఎం.సింహాచలంనాయుడు, పప్పల గోపాలకృష్ణ, పైల వెంకటరమణ, చోడి ఆనంద్ తదితరులు పాల్గొనగా, గుమ్మలక్ష్మీపురంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, నిమ్మక లక్ష్మణరావు, పార్టీ నాయకులు గోరిసెట్టి గిరిబాబు, తోయక గోపాల్, సోములు, జిన్నాన వెంకటరావు, నిమ్మక నాగేశ్వరరావులు.. జియ్యమ్మవలస మండలం, చినమేరంగి కోట వద్ద జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### బెల్లంఊట ధ్వంసం



బెల్లంఊటను పారబోస్తున్న పోలీసులు

సీతంపేట: మండలంలోని కుశిమిగూడ దగ్గరలోని మల్లమ్మకొండపై నిర్వహిస్తున్న సారాబట్టీలపై ఎస్ఐ వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం ఆకస్మిక దాడులు చేశారు. మొత్తం 600 లీటర్ల బెల్లంఊటను గుర్తించి, బయట పారబోశారు. అనంతరం డ్రమ్ములు, సారా తయారీకి తీసిన పొయ్యిలు ధ్వంసం చేశారు.

### ప్రజలపై విద్యుత్ భారం తగ్గించాలి

పాలకొండ రూరల్: కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారం మోపిందని సీపీఎం నాయకులు డి.రమణారావు, కె.రాము విమర్శించారు. ఇదే విషయమై వారు స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో ఆదివారం మాట్లాడారు.
ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి, ఏకంగా రెండు మూడు సార్లు విద్యుత్ చార్జీలు పెంచేశారని గుర్తు చేశారు. దీనికితోడు స్మార్ట్ మీటర్లు వద్దంటే విద్యుత్ స్మార్ట్‌మీటర్లు పెట్టి ప్రజాధనం దోపిడీకి సిద్ధమవుతున్నారన్నారు. రైతుల మోటార్లకు స్మార్టుమీటర్లు బిగిస్తే వాటిని విసిరికొట్టమని చెప్పిన మంత్రి లోకేష్ దీనికి సమాధానం చెప్పాలన్నారు. విద్యుత్ బిల్లులు పెంచడంతో పాటు ట్రూ అప్ చార్జీలు విపరీతంగా పెంచేయడంతో వినియోగదారులకు అధిక బిల్లులు వస్తున్నాయని, ఇప్పటికైనా పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, ప్రజలకు నష్టం కలిగించే నిర్ణయాలు చేయరాదని హితవుపలికారు.

### కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలి

పాలకొండ రూరల్:

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని విలేకరులతో ఆదివారం మాట్లాడారు. రాజ్యాంగం కార్మికులకు కల్పించిన చట్టాలను రద్దు చేయడం సరికాదన్నారు. వాటి స్థానంలో లేబర్ కోడ్‌లు తీసుకురావడమనేది వారి హక్కులను హరించడమేనన్నారు. కేంద్రం తీరును నిరసిస్తూ జూలై 9వ తేదీన దేశవ్యాప్త సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు.

# అధ్వాన రహదారితో అవస్థలు..

● రాకపోకలకు ఇబ్బంది పడుతున్న బక్కుపేట వాసులు



అధ్వానంగా ఉన్న బక్కుపేట బీటీ రోడ్డు



కోతకు గురైన రహదారి

సీతానగరం: మండలంలోని బక్కుపేట గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు అధ్వానంగా తయారైంది. పూర్తిగా గోతులతో దర్శనమిస్తున్నా అధికారులు గాని పాలకులు గాని పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఈ గ్రామానికి గతంలో రహదారి సౌకర్యం లేదు. ఒకసారి డెంగీ, టైఫాయిడ్ వంటి రోగాలు ప్రబలడంతో రాకపోకలకు సులువుగా ఉండేందుకు అప్పటి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన బీటీ రోడ్డు నిర్మించింది. మండలానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించడంతో ప్రజలు ఎంతో సంతోషించారు. అయితే వారి ఆనందం ఎంతోకాలం నిలవలేదు. ప్రస్తుతం ఆ రోడ్డు అత్యంత దారుణంగా తయారైంది. ఐదు కిలోమీటర్ల మేర గోతులేర్పడడం, కోతకు గురవ్వడంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు తప్పడం లేదు. ఒకవేళ చినుకులు పడితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని గ్రామస్తులు వాపోతున్నారు. ఎక్కడ గుంత ఉందో తెలియక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

### శ్రమదానం

జియ్యమ్మవలస రూరల్: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న పిచ్చిమొక్కలను వీఆర్‌ఏలు శ్రమదానం చేసి ఆదివారం తొలగించారు. ఏపుగా పెరిగిన మొక్కలతో కార్యాలయం ఆవరణ అంతా అపరిశుభ్రంగా దర్శనమివ్వడంతో తహసీల్దారు వై.జయలక్ష్మి ఆదేశాల మేరకు పరిసరాల పరిశుభ్రత చేపట్టినట్లు వీఆర్‌ఏలు తెలిపారు.

### పాలమెట్ట ఓపెన్ హెడ్ చానల్ అభివృద్ధి చేస్తాం

వీరఘట్టం: పాలమెట్ట-నీలానగరం ఓపెన్ హెడ్ చానల్‌ను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ హామీ ఇచ్చారు. మండలంలోని నీలానగరంలో ఆదివారం జరిగిన ఓ సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. రూ.11 లక్షల ఓ అండ్ ఎం నిధులతో ఈ చానల్‌ను ఇటీవల బాగుచేశామని గుర్తు చేశారు. ఇదే చానల్ ద్వారా 2200 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తామన్నారు.

### ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

భామిని: మండలంలోని బొడ్డగూడలోని రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్రధాన పంటలో అంతర పంటల సాగు, సేద్యంలో చేపట్టాల్సిన ప్రకృతి సేద్య పద్ధతులను వివరించారు. అలాగే ఘన, ద్రవజీవామృతాల తయారీని ప్రయోగాత్మకంగా వివరించి, వాటి ప్రయోజనాలు తెలిపారు. కార్యక్రమంలో వాసన్ సంస్థ అగ్రికల్చర్ ప్రొఫెసర్ వెంకటరావు, ఏపీసీఎన్ఎఫ్ ఎం.అంబోజీ తదితరులు పాల్గొన్నారు.

### విరబూసిన బ్రహ్మకమలం



రేగిడి: మండలంలోని లక్ష్మీపురం గ్రామ సర్పంచ్ కెంబూరు వెంకటేశ్వరరావు ఇంట్లో బ్రహ్మకమలం విరబూసింది. ఈ అరుదైన బ్రహ్మకమలం మొక్కను మూడేళ్ల క్రితం తన స్నేహితుడు బహుమతిగా ఇచ్చారని సర్పంచ్ తెలిపారు. శనివారం రాత్రి ఈ మొక్క నుంచి సుమారు 12 మొగ్గలు వికసించగా చుట్టుపక్కవారు ఆసక్తిగా తిలకించారు. ఇంకా మరికొన్ని మొగ్గలు ఉన్నాయని సర్పంచ్ వెంకటేశ్వరరావు అంటున్నారు.

# గిరిజన రైతులకు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు సాంబమూర్తి

కొమరాడ: గిరిజన రైతులకు పట్టాలు అందివ్వాలని సీపీఎం మండల కన్వీనర్ కొల్లు సాంబమూర్తి డిమాండ్‌చేశారు. ఇదే డిమాండ్‌తో ఆ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద సోమవారం చేపట్టే ధర్నాపై గుమడ సంతలో ఆదివారం ప్రచారం చేపట్టారు. అక్కడకు వచ్చిన గిరిజనులను కలిసి ధర్నా గూర్చి తెలియజేసి, రావాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనులు తరతరాలుగా సాగు చేస్తున్న పోడుభూములకు సంబంధించి వారికి ప్రభుత్వం పట్టాలు అందివ్వకపోవడంతో వారెన్నో సంక్షేమ పథకాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# బాక్సైట్ కొల్లగొట్టేందుకు సన్నాహాలు

గుమ్మలక్ష్మీపురం: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతపల్లి, అనంతగిరి, అరకు తదితర ప్రాంతాల్లోని విలువైన బాక్సైట్ ఖనిజాన్ని కొల్లగొట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. జాతీయ ఖనిజ అభివృద్ధి సంస్థ(ఎన్ఎండీసీ) ద్వారా కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ(ఏపీ ఎండీసీ) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం బాక్సైట్‌ను తవ్వి తీసి తరలించేందుకు తీవ్రంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గిరిజనులు, గిరిజన ప్రాంతాలకు నష్టం కలిగించే ఏ చర్యలనూ ఒప్పుకోబోమని, ఒకవేళ అలాంటి పనులేవైనా జరిగిగే వాటిపై గిరిజనులు ఉద్యమిస్తారన్నారు. ఆ ప్రాంతమంతా షెడ్యూల్డ్ ఏరియా భూభాగమని, 1/70 చట్టం ఉంటే తవ్వకాలు సాధ్యం కాదన్నారు. అందుకే 1/70 చట్టం రద్దుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయన్నారు.

### రోడ్లు వేయండి సారూ..

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): రోడ్లు వేయాలని మండలంలోని తోలంగూడ, కోసంగూడ, కుంబిరికివలస గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. ఇదే విషయమై వారంతా సీపీఎం నాయకుల నేతృత్వంలో వారి వారి గ్రామాల్లో ఆదివారం నిరసన చేపట్టారు. అధికారంలోకి రాగానే అన్ని ప్రాంతాలకు రోడ్లు వేస్తామని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు అధికారంలోకి రాగానే వారిచ్చిన హామీలు మరిచారన్నారు. తామొస్తే అద్దాల్లా మెరిసే రోడ్లు వేస్తామని చెప్పి కనీస రోడ్డు సదుపాయం కల్పించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా తమ ప్రాంతాలకు రోడ్లు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, నాయకులు ఎం.అద్దమేశ్వరరావు, బిడ్డిక భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

# క్రికెట్ టోర్నీ విజేత 'వెంకంపేట'



ట్రోఫీతో విజేత జట్టు సభ్యులు

సీతంపేట: మండలంలోని దేవనాపురంలో నెల రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఉదయం జరిగిన ఫైనల్ పోరులో కిల్లాడ గ్రామ జట్టుపై వెంకంపేట(పాలకొండ మండలం) జట్టు గెలిచి టోర్నీ విజేతగా నిలిచింది. విజేత జట్టుకు ఎస్ఐ వై.అమ్మన్నరావు చేతులమీదుగా ట్రోఫీ అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా వెంకంపేట జట్టుకు చెందిన చందు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా కిల్లాడ జట్టుకు చెందిన చంద్రహాస్‌లు నిలిచారు.